సాక్షి బాపట్ల

బుధవారం । 13 । ఆగస్టు । 2025



నెమలి పింఛాల అలంకరణలో కనక దుర్గమ్మ

పిడుగురాళ్ల: భవానీనగర్‌లోని కనకదుర్గమ్మ అమ్మవారిని మంగళవారం నెమలి పింఛాలతో అలంకరించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.



18 నుంచి టీటీడీ పవిత్రోత్సవాలు

వెంకటపాలెం(తాడికొండ): ఈ నెల 18 నుంచి 21 వరకు వెంకటపాలెంలోని టీటీడీలో పవిత్రోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ పర్యవేక్షణాధికారి మల్లిఖార్జున తెలిపారు.

అష్టలక్ష్మికి కుంకుమార్చన



తెనాలి: స్థానిక కొత్తపేటలోని అష్టలక్ష్మి ఆలయంలో అమ్మవారికి మంగళవారం లక్ష కుంకుమార్చన నిర్వహించారు. నిర్మలా నందగిరి స్వామి ఆశీస్సులతో కుమార్ పంప్స్ అధినేత కొత్త సుబ్రహ్మణ్యం ఈ వేడుక జరిపించారు.

న్యూస్‌రీల్

అట్రాసిటీ కేసుపై విచారణ

మేదరమెట్ల: కొరిశపాడు మండలం మేదరమెట్ల గ్రామం ఆర్టీసీ బస్టాండ్‌లో బాత్‌రూమ్‌లు కడిగే మహిళలను సోమవరప్పాడుకు చెందిన గోలి అజయ్ కులంపేరుతో తిట్టాడని, ప్లాస్టిక్ పైపులతో వాతలు పొంగేలా కొట్టాడని గతవారం పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు అయింది. దీనిపై మంగళవారం చీరాల డీఎస్పీ ఎస్‌డీ మోయిన్ బాధితులు ఉండే బస్టాండ్ ఆవరణకు వచ్చి వారిని విచారించారు. అద్దంకి రూరల్ సీఐ మల్లికార్జునరావు, ఎస్ఐ మహ్మద్ రఫీ, సిబ్బంది ఉన్నారు.

సిమెంట్ దిమ్మెను ఢీకొన్న కారు



మేదరమెట్ల: లారీని తప్పించబోయిన కారు డివైడర్ కోసం ఉంచిన సిమెంట్ దిమ్మెను ఢీకొన్న ఘటన పీ.గుడిపాడు జాతీయరహదారిపై మంగళవారం జరిగింది. అందిన వివరాల మేరకు.. తెనాలి నుంచి శ్రీకాళహస్తి వెళ్తున్న కారు పీ.గుడిపాడు జాతీయ రహదారి ఎమర్జెన్సీ ల్యాండింగ్ ప్రాంతానికి రాగానే ఆదే దారిలో వెళ్తున్న లారీ కారు పైకి వస్తుందని కారు డ్రైవర్ కారును పక్కకు తిప్పాడు. అదుపు తప్పిన కారు సిమెంట్ దిమ్మెను ఢీ కొంది. ఈ ప్రమాదంలో కారు ముందుభాగం దెబ్బతింది. ప్రమాదం జరిగిన సమయంలో కారులో ముగ్గురు ఉన్నారు. ఎవరికి గాయాలు కాలేదు.

కాలువలోకి దూసుకెళ్లిన లారీ



చీరాల: జాతీయ రహదారిపై ప్రమాదవశాత్తు లారీ అదుపు తప్పి కాలువలోకి దూసుకెళ్ళిన సంఘటన మంగళవారం జాతీయ రహదారిలోని మన్నం అపార్ట్‌మెంట్ వద్ద జరిగింది. అందిన వివరాల మేరకు పైపుల లోడుతో కోల్‌కతా నుంచి చెన్నై వెళుతున్న హెవీ లారీ అదుపుతప్పింది. ఒక్కసారిగా బోల్తా పడి రహదారి వెంట ఉన్న కాలువలోకి దూసుకెళ్ళింది. అయితే ఆ సమయంలో ఎదురుగా ఎలాంటి వాహనాలు రాకపోవడంతో ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు. దూర ప్రాంతం నుంచి వస్తున్న లారీ డ్రైవర్ నిద్రమత్తులోకి జారుకోవడంతో ప్రమాదం జరిగి ఉండవచ్చని భావిస్తున్నారు. డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి.

రూ. 1,40,520 నగదు సీజ్

అదుపులో 10 మంది పేకాట జూదరులు



చినగంజాం: మండలంలోని మోటుపల్లి పంచాయతీ పరిధిలోని కుంకుడు చెట్లపాలెం గ్రామంలో పేకాట స్థావరంపై మంగళవారం పోలీసులు దాడి చేశారు. ఇంకొల్లు సీఐ వైవీ రమణయ్య ఆధ్వర్యంలోని పోలీసులు బృందం పేకాట శిబిరంపై దాడి చేసి పేకాట ఆడుతున్న 10 మందిని అదుపులోనికి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ. 1,40,520 నగదు స్వాధీనం చేసుకున్నారు. కార్యక్రమంలో ఎస్ఐ శీలం రమేష్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సెప్టెంబరు 13న జాతీయ లోక్ అదాలత్



గుంటూరు లీగల్: సెప్టెంబరు 13వ తేదీన జాతీయ లోక్ అదాలత్ జరగనుందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి. సాయి కల్యాణ చక్రవర్తి తెలిపారు. ఈ నేపథ్యంలో ఆయన ఆధ్వర్యంలో ఆర్థిక సంస్థలు, బీమా సంస్థల అధికారులతో మంగళవారం ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అదాలత్‌లో ఎక్కువ సంఖ్యలో క్రిమినల్, సివిల్ కేసుల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. కేసుల సత్వర పరిష్కారానికి తీసుకోవలసిన చర్యల గురించి వివరించారు. స్టేక్ హోల్డర్స్, ప్రతినిధులు సహకరించాలన్నారు. నాలుగో అదనపు జిల్లా జడ్జి ఆర్.శరత్ బాబు, మూడవ అదనపు జిల్లా జడ్జి సి.హెచ్. వెంకట నాగ శ్రీనివాసరావు , రెండవ అదనపు జిల్లా జడ్జి వై.నాగ రాజా, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సయ్యద్ జియాఉద్దీన్, బార్ ప్రెసిడెంట్ వై.సూర్యనారాయణ సూచనలు చేశారు.

ఇదేంది రొయ్యో..!

- ట్రంప్ సుంకాల బూచి చూపి ధరల తగ్గింపు
- అమెరికాకు 100 కౌంట్ రొయ్యల ఎగుమతి లేకపోయినా ధర తగ్గింపు
- జిల్లాలో 21 వేల ఎకరాల్లో రొయ్యల సాగు
- 70 శాతం వనామీ, 30 శాతం టైగర్ సాగు
- సాగు దారుల్లో 60 శాతం మంది కౌలు రైతులే..
- ఎగుమతి కంపెనీలు, వ్యాపారులు కలిసి వంచిస్తున్నారంటూ రైతుల గగ్గోలు

రొయ్య రైతుకు ధరాభారం



జిల్లాలో రొయ్యల చెరువు



సాక్షి ప్రతినిధి, బాపట్ల: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన సుంకం బూచి చూపి ఎగుమతి దారులు, కంపెనీలు రొయ్యల ధరలను అమాంతం తగ్గించడంతో రైతులు లబోదిబో మంటున్నారు. ధరలు పతనం కావడంతో జిల్లాలో 60 శాతానికి పైగావున్న కౌలు రైతులు మరింతగా నష్టపోతున్నారు. పెట్టుబడి రాని పరిస్థితిలో ఆందోళన చెందుతున్నారు. నెల రోజుల క్రితం వనామీ 100 కౌంట్ ధర రూ. 270 ఉండగా ప్రస్తుతం రూ.225కు తగ్గింది. టైగర్ రొయ్య 20 కౌంట్ ధర నెల రోజుల క్రితం రూ. 680 ఉండగా ప్రస్తుతం 570కి తగ్గింది. ఈ లెక్కన నెలరోజుల్లో వనామీ ధర రూ. 45, టైగర్ ధర రూ. 100 తగ్గింది. దీనివల్ల లాభాల సంగతి దేవుడెరుగు పెట్టుబడులు కూడా రావని రైతులు గగ్గోలు పెడుతున్నారు.

పెట్టుబడులు వచ్చే పరిస్థితి లేదు

రొయ్యల సాగు పెట్టుబడులు ఏడాది కేడాదికి పెరుగుతున్నాయి. విద్యుత్ బిల్లులు రెట్టింపవగా, జీవ రసాయన మందుల ధరలు అయాంతం పెరిగాయి. పెరిగిన వర్కర్స్ జీతాలు దీనికి తోడయ్యాయి. దీంతో ఎకరం రొయ్యల సాగుకు రూ.4లక్షల నుంచి 5 లక్షల ఖర్చవుతోంది. ఈ లెక్కన పెట్టుబడులు రావాలంటే వనామీ 100 కౌంట్ కౌలు రైతు అయితే రూ. 250 అమ్మాలి. సొంత రైతు అయితే రూ.225 అమ్మాలి. కానీ ప్రస్తుతం ధరలు అంతకు మించి తగ్గాయి. దీంతో లాభాల సంగతి దేవుడెరుగు పెట్టుబడులు వచ్చే పరిస్థితి కానరావడంలేదని రైతులు గగ్గోలు పెడుతున్నారు.

జిల్లాలో సాగు ఇలా..

జిల్లాలో రేపల్లె, నగరం, నిజాంపట్నం, పిట్టలవాని పాలెం, కర్లపాలెం, బాపట్ల, చీరాల, వేటపాలెం, చినగంజాం మండలాల పరిధిలో 12 వేల మంది రైతులు 21 వేల ఎకరాల్లో రొయ్యలు సాగుచేస్తున్నారు. ఇందులో 70 శాతం వనామీ సాగులో ఉండగా 30 శాతం టైగర్ రొయ్యను సాగుచేస్తున్నారు.

ట్రంప్ సుంకాల బూచి చూపి..

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధించిన సుంకాల బూచి చూపి ఎగుమతి దారులు, కంపెనీలు రైతులను నిలువునా ముంచుతున్నాయి. వాస్తవానికి 100 కౌంట్ రొయ్య అమెరికాకు వెళ్లదు. కేవలం 20, 30, 40, 50 కౌంట్ రొయ్యలు మాత్రమే ఎగుమతి అవుతున్నాయి. జిల్లాలో వనామీలో అధికంగా 100 కౌంట్ రొయ్యల విక్రయాలు మాత్రమే సాగుతున్నాయి. వనామీ 100 కౌంట్ రొయ్య చైనా, గల్ఫ్ దేశాలకు ఎగుమతి అవుతోంది. అమెరికాకు రొయ్య ఎగుమతి కాకుండానే ఎగుమతి దారులు, వ్యాపారులు ట్రంప్ సుంకాల పేరుతో ఇబ్బడి ముబ్బడిగా ధరలు తగ్గించి రొయ్య రైతును దోపిడీ చేస్తున్నారు. ఒక్క కిలోకు రూ. 45 తగ్గితే ఎకరాలో వచ్చే దిగుబడి 1.50 టన్నులు అనుకున్నా రూ. 70 వేలకు పైగా నష్టం వస్తుండగా కౌలు రైతుకు రూ. 1.20 లక్షల నుంచి 1.70 లక్షల నష్టం వస్తోంది.

సాక్షి గ్రౌండ్ రిపోర్ట్

ఎకరాకు రూ.లక్షపైనే నష్టం

రొయ్యల ఉత్పత్తి బాగా ఉంటే ఎకరానికి 2 టన్నులు దిగుబడి ఉంటుంది. ప్రస్తుతం సగటున ఎకరానికి 1.50 టన్నులకు మించి దిగుబడి రావడంలేదు. ఈ లెక్కన వున్న ధరతో ఎకరాకు రూ. 3.50 లక్షలకు మించి రాబడి వుండడంలేదు. దీంతో ఎకరాకు సొంత రైతుకు రూ.లక్షకు తగ్గకుండా, కౌలు రైతు రూ. 1.50 లక్షల నుంచి 2 లక్షల వరకు నష్టపోవాల్సి వస్తోంది. ఎకరం కౌలు చెరువులనుబట్టి రూ. 50 వేల నుంచి రూ. 1లక్ష ఉంది. కౌలు రైతులకు వడ్డీలు అదనపు భారంగా మారనున్నాయి. దీంతో రొయ్య రైతులు లబోదిబోమంటున్నారు.

పట్టించుకోని ప్రభుత్వం

రొయ్య రైతులను ఎగుమతి వ్యాపారులు, కంపెనీలు ట్రంప్ సుంకాల పేరుతో వంచిస్తున్నా కూటమి సర్కారుకు చీమకుట్టినట్లు కూడా లేదు. ఆది నుంచి రైతులంటే గిట్టని బాబు సర్కార్ రొయ్య రైతులను పట్టించుకోకుండా గాలికి వదిలేశారు. మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి హయాంలో ధరలు స్థిరంగా ఉండేలా చూసి నష్టపోకుండా చర్యలు తీసుకున్నారు. వారికి సబ్సిడీతో విద్యుత్ అందించారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఇబ్బడి ముబ్బడిగా విద్యుత్ చార్జీల భారాన్ని మోపి రొయ్య రైతులను ఇబ్బందులను గురిచేస్తోంది.

ఎగుమతులు లేకపోవడంతో నష్టాలు



వనామీ సాగుకు డిమాండ్ లేదు. పండించిన పంట ఎగుమతి లేకపోవడంతో గిట్టుబాటు ధర కూడా లభించడం లేదు. ఎకరాకు రూ.3 లక్షల వరకు పెట్టుబడులు పెట్టాం. మూడు ఎకరాల్లో వనామీ సాగు చేస్తున్నా కనీసం రూ.లక్ష కూడా వచ్చే పరిస్థితి లేదు. తీవ్రంగా నష్టపోతున్నాం. ప్రభుత్వం ఆదుకోవాలి.

– తిరుపతిరావు, ఆక్వారైతు, కొత్తపాలెం

ఉప ఎన్నికల తీరు ప్రజాస్వామ్యానికి వ్యతిరేకం

వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వరికూటి అశోక్‌బాబు



వేమూరు: పులివెందుల జెడ్పీటీసీ ఉప ఎన్నికల్లో ప్రజాస్వామ్యం అపహాస్యమైందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, వేమూరు నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు పేర్కొన్నారు. మంగళవారం వేమూరులోని తన కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉప ఎన్నికలు జరిగిన తీరు చూస్తుంటే రాష్ట్ర ఎన్నికల సంఘం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కనుసన్నల్లో పని చేస్తుందని తేటతెల్లం అవుతుందన్నారు. టీడీపీ నేతలు వైఎస్సార్ సీపీ ఎన్నికల ఏజెంట్లను బూత్‌ల్లోకి రాకుండా అడ్డుకున్న తీరును ప్రజలు చూశారన్నారు. వైఎస్సార్ సీపీకి చెందిన వ్యక్తులను ఓట్లు వేయకుండా టీడీపీ గూండాలు అడ్డుకున్నారన్నారు. పోలీసులు కొమ్ముకాయడంతో టీడీపీ నేతలు బహిరంగంగా రిగ్గింగ్ పాల్పడ్డారన్నారు. పులివెందులలో బలం లేదని తెలిసీ, చంద్రబాబు రిగ్గింగ్‌లు, బూత్‌ల ఆక్రమణలకు తెరలేపాడన్నారు. ఇప్పటికైనా ఎన్నికల కమిషన్ కలుగజేసుకుని రిగ్గింగ్ జరిగిన బూత్‌ల్లో రీ పోలింగ్ నిర్వహించాలని డిమాండ్ చేశారు.

మెటల్ క్వారీలో కార్మికుడు మృతి

బల్లికురవ: క్వారీల్లో నిబంధనలు భద్రతా చర్యలు పాటించనందున ప్రమాదాలు పునరావృతం అవుతున్నాయి. మొన్న గ్రానైట్ క్వారీలో రాయి డ్రిల్లింగ్ చేస్తుండగా జరిగిన ఘోర ప్రమాదాన్ని మరవక ముందే మంగళవారం మెటల్ క్వారీలో డ్రిల్లింగ్ చేస్తుండగా రాళ్లుపడి వలస కార్మికుడు అక్కడికక్కడే మృతి చెందాడు. అందిన వివరాల మేరకు.. ఒడిశా రాష్ట్రం మదలీబదర్ గ్రామానికి చెందిన సాధురామ్ కశ్యప్ (32) మండలంలోని నక్కబొక్కలపాడు గ్రామ సమీపంలోని సనకొండ వెంకట సాయి మెటల్ క్వారీలో పనిచేస్తున్నాడు. మంగళవారం క్వారీ ఎగువ భాగంలో జాకితో రాయి డ్రిల్లింగ్ చేస్తున్నాడు. పైనున్న రాళ్లు కశ్యప్‌పై పడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు అవివాహితుడు. బతుకుదెరువుకు ఇక్కడ మెటల్ క్వారీలో పనిచేస్తున్నాడు. వీఆర్ఓ మునలయ్య ఫిర్యాదుతో బల్లికురవ ఎస్ఐ వై.నాగరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

టౌన్ హాల్ @120

ప్రథమాంధ్ర మహా సభలకు వేదిక



బాపట్లలోని టౌన్ హాలు

స్వాతంత్ర్య స్ఫూర్తి

బాపట్ల అర్బన్: ఘనమైన చరిత్రకు సజీవ సాక్ష్యం బాపట్ల టౌన్ హాల్. స్వాతంత్ర్య సంగ్రామ చరిత్రలో మరుపురాని ఘట్టాలకు ఈ టౌన్‌హాల్ వేదికగా నిలిచింది. ఈ భవనం నిర్మించి 120 సంవత్సరాలు పూర్తయింది. 1905 సంవత్సరం జూలై 17న అప్పటి గుంటూరు జిల్లా కలెక్టర్ బ్రాడీ ఈ టౌన్ హాలును ప్రారంభించారు. మహాత్మా గాంధీ, పండిట్ జవహర్ లాల్ నెహ్రూ, డాక్టర్ బాబు రాజేంద్ర ప్రసాద్ వంటి ఎందరో జాతీయ నాయకులు వివిధ సందర్భాలలో ఈ టౌన్ హాల్ సందర్శించి, ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. 1913 మేలో జరిగిన ప్రథమాంధ్ర మహాసభలకు టౌన్‌హాల్ వేదికగా నిలిచింది. ఇంగ్లాండులో పట్టాభిషిక్తుడు అవుతున్న చక్రవర్తి ఎడ్వర్డ్ గౌరవార్థం ఎడ్వర్డ్ పట్టాభిషేక స్మారక టౌన్‌హాల్‌గా దీనికి నామకరణం చేశారు. ఆయన పట్టాభిషేకం రోజునే ఈ టౌన్‌హాల్ నిర్మాణం జరిగింది. 1908లో బాపట్లకు వచ్చిన జిల్లా మున్సిఫ్ మెజిస్ట్రేట్ న్యాపతి సుబ్బారావు పంతులు చొరవతో టౌన్ హాల్లో టెన్నిస్ కోర్టు ప్రారంభమైంది. నిత్యం సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాలతో టౌన్ హాల్ ఒక ప్రధాన కేంద్రంగా ఉంది. ఈ టౌన్ హాల్‌లో న్యూస్ పేపర్ క్లబ్ నిరంతరం పాఠకులకు అందుబాటులో ఉంది.

వైఎస్సార్ సీపీని బలహీనపరిచేందుకు కూటమి కుట్ర

వైఎస్సార్ సీపీ రాష్ట్ర పంచాయతీ రాజ్ విభాగం ఉపాధ్యక్షుడు భవనం శ్రీనివాసరెడ్డి



పర్చూరు (చినగంజాం): రాష్ట్రంలో వైఎస్సార్ సీపీని బలహీనపరచాలన్నదే ప్రధాన ఎజెండాగా కూటమి ప్రభుత్వంలోని టీడీపీ కుట్ర చేస్తోందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర పంచాయతీ రాజ్ విభాగం ఉపాధ్యక్షుడు భవనం శ్రీనివాసరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సుమారు 50కి పైగా జెడ్పీటీసీ స్థానాలు ఖాళీలుంటే కేవలం వైఎస్సార్ కడప జిల్లాలోని పులివెందుల, ఒంటిమిట్టలో మాత్రమే ఉప ఎన్నికలు నిర్వహించడం కూటమి ప్రభుత్వం దిగజారుడుతనానికి నిదర్శనమని అన్నారు. ఎన్నికల ప్రక్రియలో నామినేషన్‌ల పర్వం ముగిసి మరో రెండు రోజుల్లో పోలింగ్ జరుగుతుందన్న పరిస్థితుల్లో పోలింగ్ బూత్‌ల మార్పు చేయడమనేది రాష్ట్ర చరిత్రలోనే ఎన్నికల కమిషన్ తీసుకున్న దుర దృష్టకరమైన చర్య అన్నారు. పంచాయతీ రాజ్ వ్యవస్థకు తూట్లు పొడిచేలా ఎన్నికలు నిర్వహించడమే కాక పోలింగ్ బూత్‌లలోకి ఏజెంట్లను పోనివ్వకుండా నిలుపుదల చేయడం, పోటీ చేసిన అభ్యర్థిని కనీసం ఓటువేసేందుకు కూడా రానివ్వకుండా పోలీసులను అడ్డం పెట్టుకొని టీడీపీ గూండాలు వ్యవహరించిన తీరు అప్రజాస్వామికం అన్నారు. గత 40 సంవత్సరాలుగా రాజకీయాల్లో ఉన్న తాను పంచాయతీ రాజ్ వ్యవస్థలో ఇంతటి దారుణమైన ఎన్నికల ప్రక్రియను చూడలేదని అన్నారు. ప్రస్తుతం అక్కడ ఎన్నికల జరుగుతున్న తీరు ఎన్నికల కమిషన్‌కు సిగ్గు చేటు అన్నారు.

మెరుగైన విద్యుత్ సరఫరాకు కృషి

ఏపీ సీపీడీసీఎల్ సీఎండీ పి.పుల్లారెడ్డి

మాచర్ల: రాష్ట్రంలో మెరుగైన విద్యుత్ సరఫరాతో పాటు, ఉత్తమ సేవలందించాల్సిన బాధ్యత విద్యుత్ శాఖ ఇంజినీర్లపై ఉందని ఏపీ సీపీడీసీఎల్ సీఎండీ పి.పుల్లారెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని విద్యుత్ శాఖ డివిజినల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన డివిజినల్ పరిధిలోని ఇంజినీర్లు, అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భవిష్యత్తులో కరెంట్ బిల్లుల వసూళ్ల విధానం మారిపోతుందని, బకాయిలు పేరుకుపోకుండా చూసుకోవాలని సూచించారు. బకాయిలు ఉన్న ప్రభుత్వ శాఖల అధికారులను కలిసి బకాయిలు క్లియర్ చేయకపోతే చర్యలు తప్పవని సూచించాలని తెలిపారు. టెక్నికల్ ఎలక్ట్రికల్ డైరెక్టర్ మురళీ కృష్ణ యాదవ్, విజయ్‌కుమార్, ఈఈ ఎస్.సింగయ్యతో పాటు పలువురు డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లు బిగించుకోండి..

రాష్ట్ర ప్రభుత్వం స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటుందని సీఎండీ పి.పుల్లారెడ్డి అన్నారు. మాచర్లలోని కేసీపీ అతిథి గృహంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటుతో పలు ప్రయోజనాలు ఉన్నాయన్నారు.

కార్మికుల సంక్షేమ బాధ్యత అధికారులదే..!

జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

బాపట్ల: కార్మికుల సంక్షేమం, వారి హక్కుల సంరక్షణ బాధ్యత అధికారులదేనని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి తెలిపారు. పరిశ్రమలలో ప్రమాదాల నివారణ, ముందస్తు జాగ్రత్త చర్యలపై పరిశ్రమల యాజమాన్యం, అనుబంధశాఖల అధికారులతో మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించారు. కార్మికుల కోసం ప్రభుత్వాలు అనేక సంక్షేమ పథకాలు, కార్యక్రమాలను అమలు చేస్తున్నాయన్నారు. సంక్షేమ పథకాలను కార్మికులందరూ సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. అసంఘటిత రంగ కార్మికులందరిని ఈ-శ్రమ పోర్టల్‌లో చేర్చాలన్నారు. ప్రతి కార్మికుడికి యాజమాన్యాలు పీఎఫ్, ఈఎస్ఐలో రిజిస్ట్రేషన్ చేయించాలన్నారు. కార్మికులు శ్రమ దోపిడీకి గురికాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. రోజుకు ఎనిమిది గంటలే పనిచేయాలని, వారానికి ఒక సెలవు తప్పనిసరిగా ఉండాలన్నారు. పండుగలు, ప్రభుత్వ సెలవు దినాలను కార్మికులకు వర్తింపచేయాలన్నారు. వీటిపై అధికారులు నిరంతరం పర్యవేక్షించాలన్నారు. కార్మిక శాఖ డిప్యూటీ చీఫ్ త్రినాథ్, డిప్యూటీ కమిషనర్ గాయత్రిదేవి, సహాయ కార్మిక శాఖ కమిషనర్ వెంకట శివప్రసాద్, సహాయ కార్మిక శాఖ అధికారి వి.సాయిజ్యోతి, పరిశ్రమలశాఖ జిల్లా మేనేజర్ రామకృష్ణ, పరిశ్రమల యజమానులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు వేగవంతం చేయాలి..

బాపట్ల: ఉపాధి హామీ పథకం పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి అధికారులకు సూచనలు చేశారు. మంగళవారం స్థానిక కలెక్టర్ కార్యాలయంలోని వీడియో సమావేశ మందిరంలో 'ఉపాధి' పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఏపీఎన్ఆర్ఈజీఎస్ పనుల కింద మండలాల్లో మిగిలి ఉన్న 46 పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆయన ఎంపీడీఓలకు సూచించారు. జాబ్ కార్డుల జారీపై ఆరా తీశారు. దిగువస్థాయి కుటుంబాలను గుర్తించి వారికి జాబ్ కార్డులు ఇవ్వాలన్నారు. జిల్లాలో డెంగీ జ్వరాల వ్యాప్తి నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు పలు సూచనలు చేశారు. గడిచిన రెండు రోజుల్లో కొల్లూరు మండలంలో పెద్దలంక, చింతల లంక గ్రామాల్లో రెండు కేసులు, ఈదుపల్లి, యాజలిలో ఒక్కో కేసు నమోదయిందని వైద్యాధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. పీడీ డ్వామా విజయలక్ష్మి, డీపీఓ ప్రభాకర్, డీఎంహెచ్ఓ డాక్టర్ ఎస్.విజయమ్మ, పంచాయతీరాజ్ ఈఈ వేణుగోపాల్‌రెడ్డి, బాపట్ల, చీరాల డీఎల్‌డీఓలు విజయలక్ష్మి, పద్మావతి, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ పీఎం మాధవి పాల్గొన్నారు.

పరిశుభ్రతతోనే విద్యార్థులకు ఆరోగ్యం

బాపట్ల: పరిశుభ్రతతోనే విద్యార్థుల ఆరోగ్యం పదిలంగా ఉంటుందని కలెక్టర్ జె. వెంకట మురళి తెలిపారు. మంగళవారం స్థానిక డాక్టర్ అంబేడ్కర్ గురుకులం పాఠశాలలో జరిగిన నులిపురుగుల నిర్మూలన దినోత్సవంలో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు.

భారీ వర్షాల హెచ్చరికలతో అప్రమత్తంగా ఉండండి...

బాపట్ల: భారీ వర్షాల హెచ్చరికలతో అధికార యంత్రాంగం అప్రమత్తం కావాలని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి ఆదేశించారు. విపత్తు నిర్వహణ, పర్యవేక్షణపై ఆర్డీఓలతో మంగళవారం స్థానిక కలెక్టరేట్ లో ఆయన సమావేశం నిర్వహించారు. లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని కలెక్టర్ సూచించారు. కృష్ణానది ఎగువ ప్రాంతాల నుంచి 2.50 లక్షల క్యూసెక్కులు దిగువకు విడుదల చేస్తున్నందున్న అధికారులు అప్రమత్తం కావాలన్నారు. ఇన్‌చార్జి జేసీ జి.గంగాధర్ గౌడ్, రివర్ కన్సర్వేటర్ కార్యనిర్వాహక ఇంజినీర్ రవికిరణ్, బాపట్ల, చీరాల, రేపల్లె ఆర్డీఓలు గ్లోరియా, చంద్రశేఖర్, రామలక్ష్మి పాల్గొన్నారు.

'క్విట్ ఇండియా' అమరవీరులకు ఘన నివాళి

- స్థూపాల వద్ద నివాళులర్పించిన మంత్రి మనోహర్
- బహిరంగ సభలో పలు రంగాల ప్రముఖులకు సత్కారం



అమరవీరుల స్థూపాల వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించి, తెలుగు తల్లికి నమస్కరిస్తున్న మంత్రి నాదెండ్ల మనోహర్, సబ్ కలెక్టర్ సంజనా సింహ, చైర్‌పర్సన్ రాధిక

తెనాలి: క్విట్ ఇండియా ఉద్యమంలో భాగంగా తెనాలిలో 1942 ఆగస్టు 12న జరిగిన నిరసనలో పోలీసుల కాల్పుల్లో కన్నుమూసిన ఏడుగురు అమరవీరులకు మంగళవారం ఘన నివాళి అర్పించారు. మున్సిపాలిటీ ఆధ్వర్యంలో జరిగిన వీర సంస్మరణ దినోత్సవంలో భాగంగా స్థానిక ఎమ్మెల్యే, మంత్రి నాదెండ్ల మనోహర్, తెనాలి సబ్‌కలెక్టర్ వి.సంజనా సింహ, మున్సిపల్ చైర్ పర్సన్ తాడిబోయిన రాధిక, మాజీ మంత్రి నన్నపనేని రాజకుమారి తదితరులు రణరంగచౌక్‌లోని అమరవీరుల స్థూపాల వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి శ్రద్ధాంజలి ఘటించారు. అమరవీరులకు జోహార్లు అర్పించారు. ముందుగా అన్నాబత్తుని పురవేదిక నుంచి ర్యాలీగా బయలుదేరి రణరంగ్ చౌక్‌కు చేరుకున్నారు. ఎన్‌సీసీ క్యాడెట్లు, పోలీసులు కవాతుగా తరలి వచ్చారు. మంత్రి నాదెండ్ల మనోహర్ అక్కడి తెలుగు తల్లి విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. తదుపరి జాతీయ జెండా ఆవిష్కరించారు. అనంతరం జరిగిన బహిరంగ సభకు మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక అధ్యక్షత వహించారు. వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. విశేష సేవలందించిన ప్రముఖులకు, స్వాతంత్ర్యోద్యమంలో అసువులుబాసిన వారి కుటుంబ సభ్యులకు సత్కరించారు. సత్కారం అందుకున్నవారిలో సమరయోధుడు షేక్ అబ్దుల్ వహాబ్ కోడలు షేక్ నూర్జహాన్, మరో సమర యోధుడి కుమారుడు షేక్ కరిముల్లా, డీ3 శారద సర్వీస్ సొసైటీ వ్యవస్థాపకురాలు డాక్టర్ డి.శారద, మొవ్వా విజయలక్ష్మి స్మారక సేవాసమితి వ్యవస్థాపకుడు మొవ్వా సత్యనారాయణ, హెల్పింగ్ సోల్జర్స్ ఇనయతుల్లా, ప్రముఖ శిల్పి కాటూరి వెంకటేశ్వరరావు, తెనాలి డీఎస్పీ బి.జనార్దనరావు, మాజీ సైనికోద్యోగి అనంతగిరి ఏడుకొండలరావులు ఉన్నారు. నృత్యగురువులు ఎ.వెంకటలక్ష్మి, ఆరాధ్యుల తేజస్వి ప్రఖ్యల శిష్యబృందం వివిధ నృత్యాంశాలను, 'మా తెలుగు తల్లి' నృత్యరూపకాన్ని ప్రదర్శించింది.